ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

బుధవారం 7 ఫిబ్రవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	178	203
సూర్యాపేట	రూ.136	196	223
నల్లగొండ	రూ.136	196	223

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.0 । కనిష్ఠం 21.0

నల్లగొండ నుంచే కేసీఆర్ కృష్ణాజల ఉద్యమం



గత ఏడాది నవంబరు 30న ఏపీ ప్రభుత్వం సాగర్ డ్యాంపై ఏర్పాటుచేసిన కంచె, బ్యారీకేడ్లు(ఫైల్)

రాజకీయపురిటి గడ్డ నల్లగొండ నుంచే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో ప్రజాఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు. గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం, అనారోగ్యకారణాలతో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక క్రియాశీలక రాజకీయాలకు కొన్నాళ్లు దూరంగా ఉన్న మాజీ సీఎం కేసీఆర్ ప్రతిపక్ష పాత్రను నల్లగొండ నుంచే ప్రారంభించనున్నారు.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

కృష్ణాజలాల్లో రాష్ట్ర హక్కుల సాధన పోరాటాన్ని ఎంచుకున్న కేసీఆర్ ఈ అంశంపై తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఈనెల 13న నల్లగొండలో కృష్ణాజలాల పరిరక్షణ సభ నిర్వహించాలని నిర్ణయించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన నల్లగొండ ఉమ్మడి జిల్లా కీలక నేతల సమావేశంలో కేసీఆర్ ఈ మేరకు సభ నిర్వహణపై మార్గనిర్దేశం చేశారు. లోక్‌సభ ఎన్నికల ముంగిట రాజకీయచైతన్యం కలిగిన నల్లగొండ నుంచే కేసీఆర్ కృష్ణాజలాల ఉద్యమం చేపట్టడం రాజకీయంగా ఆసక్తి రేకెత్తిస్తోంది.

కృష్ణానది జలాల్లో హక్కుల సాధనే ప్రధాన ఎజెండా

కృష్ణానది జలాల పరిరక్షణ సభ పేరుతో ఈనెల 13న మధ్యాహ్నం 3గంటలకు నల్లగొండలో బీఆర్ఎస్ నిర్వహించనుంది. కృష్ణాజలాల్లో రాష్ట్ర హక్కులు సాధించడమే ఈ సభ ప్రధాన ఎజెండా. కేంద్రం ఆధీనంలోని కేఆర్ఎంబీ (కృష్ణానది యాజమాన్య బోర్డు) పరిధిలోకి నాగార్జునసాగర్ ప్రాజెక్టు వెళ్లకుండా నిరోధించాలని, ఒక్కసారి కేంద్రం పరిధిలోకి ప్రాజెక్టులు వెళ్తే తాగునీటి అవసరాలకు సైతం నీటిని వినియోగించుకోలేని దయనీయస్థితి ఉంటుందనేది బీఆర్ఎస్ వాదన. అదేవిధంగా నీరు అందుబాటులో ఉన్నప్పుడు, రైతులకు అవసరమైనప్పుడు సాగునీరు విడుదల చేసే అంశం కూడా రాష్ట్రం పరిధిలో ఉండదని, ఈఅంశాలపై రైతులను, ప్రజలను చైతన్యం చేయడానికే సభ నిర్వహించాలని కేసీఆర్ తలపెట్టినట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.రాజకీయ కోణంలో కాకుండా రైతుల ప్రయోజనాల కోణంలోనే ఈ సభను చూడాలని, పార్టీలకు అతీతంగా సభకు రైతులు రావాలని నేతలు కోరుతున్నారు.

లోక్‌సభ ఎన్నికల ముందు

లోక్‌సభ ఎన్నికల ముందు కృష్ణాజలాల హక్కుల అంశాన్ని బీఆర్ఎస్ తెరపైకి తేవడంతో ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ కృష్ణానీటి విడుదల కోసం, ప్రాజెక్టుల సాధన కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాదయాత్రలు, సభలు ఉమ్మడి జిల్లాలో కొనసాగాయి. తాజాగా, ప్రతిపక్షంలోకి వచ్చాక మరోసారి కీలకమైన నదీజలాల అంశాన్నే బీఆర్ఎస్ ముందుకుతేవడంతో వచ్చే ఎన్నికల్లో ఈ అంశమే రాజకీయ ఎజెండా కానుందని తెలుస్తోంది. ఈ సభను విజయవంతం చేసేందుకు అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా రైతులు తరలివచ్చేలా మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు రంగంలోకి దిగుతున్నారు. సభను విజయవంతం చేయడం ద్వారా కృష్ణాజలాల అంశాన్ని బలంగా జనంలోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు.

- 13న భారీ సభ
- ప్రతిపక్ష నేతగా తొలిసభ నిర్వహణకు సిద్ధం



కేసీఆర్ నల్లగొండకు వస్తే ప్రజలు తిరగబడతారు

కేసీఆర్ నల్లగొండకు వస్తే ప్రజలు తిరగబడి తరిమి కొడతారు. ఇక్కడి ప్రజల రక్తం మరుగుతోంది, కేసీఆర్ బస్సులో వచ్చినా, మిలటరీని పెట్టుకుని వచ్చినా ఆయన ఇక్కడ అడుగు పెట్టలేరు. ప్రాజెక్టులను సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి అప్పగించారని చెప్పడానికి కేసీఆర్‌కు సిగ్గుండాలి. మేం వచ్చి రెండు నెలలు కాలేదు. ప్రాజెక్టులు అప్పగించేందుకు ఎవరితో కుమ్మక్కు అయ్యామో చెప్పాలి. కేసీఆర్ హయాంలోనే ప్రాజెక్టులన్నీ కేఆర్ఎంబీకి అప్పగించారు. కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రాకు 512 టీఎంసీలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఆ రోజు పెద్ద తప్పు చేయడంతోనే దక్షిణ తెలంగాణలోని మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో తాగునీరు లేని పరిస్థితులకు కేసీఆరే కారణం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 11వేల క్యూసెక్కులు నుంచి 44వేల క్యూసెక్కులు ఆంధ్రాకు తరలించుకుపోగా, జగన్మోహనరెడ్డి సీఎం అయ్యాక 88వేల క్యూసెక్కులు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి తరలించుకుపోయేలా డిజైన్ రూపొందించారు. శ్రీశైలం ప్రాజెక్టులో 795అడుగుల నీరు(డెడ్ స్టోరేజీకి చేరువ) ఉన్నప్పుడు బురద నీటిని కూడా తీసుకెళ్లడానికి మాజీ సీఎం కేసీఆరే కారకుడు. కుర్చీ వేసుకుని కూర్చుని ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తానన్న కేసీఆర్ ఒక్కసారి కూడా ఆ ప్రాజెక్టుపై సమీక్ష చేయలేదు. ఉత్తర తెలంగాణలో కాల్వలకు లైనింగ్ చేయించుకున్న కేసీఆర్ దక్షిణ తెలంగాణలోని ప్రాజెక్టులోని కాల్వలు మాత్రం పట్టించుకోలేదు. నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో సబ్ కాంట్రాక్టర్‌గా మారి వందల కోట్లు దోచుకున్నాడు. ఆయన ఆస్తులపై డ్రోన్ కెమెరాలతో రికార్డు చేయించి త్వరలో బండారం బయట పెడతాం.

– నల్లగొండలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ప్రజలను మేల్కొలిపేందుకే సభ

కృష్ణాజలాల్లో తెలంగాణ హక్కులపై, కేంద్రం పరిధిలోకి ప్రాజెక్టులు వెళ్తే భవిష్యత్‌లో ఎదుర్కొనే ఇబ్బందుల పై ప్రజలకు అవగాహన కల్పించి, వారిని మేల్కొలిపేందు కే బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించాం. రైతుల ప్రయోజనాలే తప్ప ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహనారాహిత్యంతో, తెలివి తక్కువతనంతో తప్పులపై తప్పులు చేస్తూ రాష్ట్ర ప్రయోజనాల కు నష్టం కలిగిస్తోంది. వాళ్లు ఇప్పటికైనా అహంభావం వీడి సీనియర్లను సంప్రదించి కృష్ణాజలాల్లో రాష్ట్ర హక్కులు సాధించడానికి ఏం చేయాలో ఆలోచించాలి. ఈ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. పార్టీలకు అతీతంగా రైతులు సభకు తరలిరావాలి.


– గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి, మాజీమంత్రి



జిల్లాలో నెల రోజులు 30, 30(ఎ) యాక్ట్

జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల పాటు 30, 30 (ఎ) పోలీస్ యాక్ట్-1861 అమలులో ఉంటుందని ఎస్పీ చందనా దీప్తి మంగళవా రం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారు ల ముందస్తు అనుమతి లేనిది ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించేలా, ప్రజాధనానికి నష్టం కలిగిం చేలా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు,ప్రజా ప్రతి నిధులు, ప్రజా సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు.

ఎడమకాల్వ మేజర్లకు నీటి విడుదల నిలిపివేత



డిస్ట్రిబ్యూటరీ నుంచి నిలిచిన నీటి విడుదల

ఆయకట్టు రైతుల ఆశలకు గండి

నిడమనూరు, ఫిబ్రవరి 6: సాగునీ టి విడుదలపై ఆయకట్టు రైతులకు నిరాశే ఎదురైంది. వారం రోజులపాటు నీటిని విడుదల చేస్తే పొలాలు కాపాడుకోవచ్చనుకున్న రైతుల ఆశలకు అధికారులు గండికొట్టారు. మేజర్ కాల్వలకు నీటి విడుదల కేవలం రెండు రోజుల మురిపెంగానే మిగిలింది. కనీసం ఐదు రోజులు నీటి విడుదల ఉంటుందని రైతులు భావించారు. కానీ, రెండు రోజులకే నీటి విడుదలను నిలిపివేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని ముదిమాణిక్యం, నారెళ్లగూడెం మేజర్లకు మంగళవారం ఉదయం నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌ను నింపేందుకు ఈనెల 9వరకు సాగర్ ప్రధానకాల్వకు నీటిని విడుదల కొనసాగనుంది. అయితే ఎండుతున్న పొలాలను కాపాడుకునేందుకు రైతులు మేజర్ల వద్ద ఆందోళన చేస్తుండటంతో, ప్రజాప్రతినిధులు, రైతుల విజ్ఞప్తి మేరకు మేజర్లకు కూడా నీటిని విడుదల చేశారు. దీంతో ఎండుతున్న పొలాలు కాపాడుకోవచ్చని ఆశించారు. పంట కాల్వలు సక్రమంగా లేకపోవడంతో చివరి భూములకు ఇంకా నీరు చేరలేదు. మరో మూడు రోజులపాటు నీటి విడుదల ఉంటుందనే రైతులు ఆశపడ్డారు.

ప్రధాన కాల్వకు 9వరకు నీటి విడుదల ఉంటున్నందున మేజర్లకు కూడా అప్పటి వరకు నీటిని విడుదల చేస్తారని భావించారు. కానీ, సూర్యాపేట జిల్లాలోని భూములకు నీరు అందడం లేదనే ఉద్దేశంతో మేజర్ కాల్వలకు నీటి విడుదలను తక్షణ మే నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రా వడంతో మంగళవారం ఉదయమే అధికారులు మేజర్లకు నీటిని నిలిపారు. దీంతో ఆయకట్టు రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. షట్టర్లను ఎత్తి రైతులే నీటిని విడుదల చేసుకునే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో మేజర్ల వద్ద రాత్రివేళ అధికారులు, పోలీసులు కాపలా కాస్తున్నారు. ఇటీవల ముదిమాణిక్యం మేజర్‌కాల్వ వద్ద సాగునీటి కోసం నిడమనూరు, త్రిపురారం, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల రైతులు ఆందోళన చేసిన విషయం విదితమే.ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు నీటి విడుదల నిలిపివేశామని ఎన్నెస్పీ అధికారులు చెబుతున్నారు.

హాస్టళ్లలో భద్రతెంత?

- అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతున్న హాస్టళ్లు
- కొరవడిన పర్యవేక్షణ
- భువనగిరిలో ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యతో తీవ్ర ఆవేదన
- ఇన్‌చార్జీ ఎస్‌డబ్ల్యూడీవోగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్



హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

యాదాద్రి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే విద్యనభ్యసిస్తున్నారు. తమలాగా పిల్లలు కూడా నిరాక్షరాస్యులుగా ఉండొద్దని, అక్షరాలు నేర్చుకుని ఉన్నతస్థాయిలో ఉండాలని తల్లిదండ్రులు కలలు కంటున్నారు. కూలీ పనులు చేసుకుని పూటగడవడమే కష్టమైన ఈ పరిస్థితుల్లో.. పిల్లలను వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ పాఠశాలల్లో చదివించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో విద్యార్థులను ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు పంపుతున్నారు. సంక్షేమ హాస్టళ్లల్లో భద్రతపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. భువనగిరి ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలన రేపింది. సంక్షేమ హాస్టళ్లల్లో పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండటంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జిల్లాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల్లేక తీవ్రంగా ఇబ్బందులుపడుతున్నారు. పాలకులు సంక్షేమ హాస్టళ్ల పరిస్థితులను చక్కదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని విద్యార్థి సంఘాలనేతలతోపాటు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బాలురు, బాలికల హాస్టళ్లలో విధిగా వార్డెన్లు ఉండేలా చూడాలి. అయితే ఒక్కో వార్డెన్‌కు రెండు హాస్టళ్ల బాధ్యతలు అప్పగించారు. దీనికితోడు చాలా మంది హాస్టళ్లలోని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడంలేదన్న ఫిర్యాదులు అందుతున్నాయి. విద్యార్థులకు మెనూ, కాస్మొటిక్ చార్జీలు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో, ఉన్న సౌకర్యాలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇదిలా ఉంటే సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి జైపాల్‌రెడ్డి సెలవులో ఉండటంతో ఆయన స్థానంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.శ్యాంసుందర్‌ను నియమిస్తూ జిల్లాకలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు

భువనగిరి ఎస్సీ సంక్షేమ వసతిగృహంలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోవడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు.ప్రైవేట్ భవనంలో ఉన్న ఎస్సీ సంక్షేమ వసతిగృహాన్ని మరో చోటకు తరలించాలని జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.ప్రస్తుతం భువనగిరి ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో పదో తరగతి చదువుతోన్న వారు 14మంది వరకు ఉన్నారు. వీరు ఆ గదిలో ఉండేందుకు భయపడుతున్నారు. ఇంటివద్దే చదువుకుని,పరీక్షలు రాస్తామని విద్యార్థినులు కోరుతున్నారు. అయితే విద్యార్థినులను భువనగిరిలోని ఎస్సీ గురుకుల పాఠశాలకు తరలించేందుకు జిల్లాయంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. హాస్టళ్లలోని పరిస్థితిపై అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠినచర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులను హెచ్చరించారు. ఇకనుంచి వసతిగృహాల్లో తనిఖీలు చేపడుతామని తెలిపారు.

వసతిగృహాల్లో ఇన్‌చార్జీలే దిక్కు

జిల్లాలో మొత్తం 19 ఎస్సీ సంక్షేమ వసతిగృహాలు ఉండగా, వీటిలో 1,481 మంది విద్యార్థులు ఉన్నారు. 11 బాలుర వసతిగృహాల్లో మొత్తం 710 మంది, 8 బాలికల వసతిగృహాల్లో 771మంది వరకు ఉన్నారు. కళాశాల విద్యార్థులకు బాలురు, బాలికలకు ఒక్కో వసతి గృహం ఉంది. ఇందులో మొత్తం 238మంది విద్యార్థులున్నారు. 19 మంది ఎస్సీ హాస్టల్ వార్డెన్లకు గానూ 10మంది మాత్రమే ఉన్నారు. తొమ్మిది వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో మొత్తం 15 వసతిగృహాల్లో 624 మంది విద్యార్థులు ఉన్నారు. వీటిలో బాలుర 10, బాలికలకు 5 వసతిగృహాలు ఉన్నాయి. బాలురు మొత్తం 393మంది, బాలికలు 231 మంది ఉన్నారు. జిల్లాలో కళాశాల విద్యార్థులకోసం మొత్తం ఐదు వసతిగృహాలు మంజూరయ్యాయి. వీటిలో 4 బాలురు, ఒకటి బాలికల వసతి గృహాల ఉండగా, వీటిలో మొత్తం 420 విద్యార్థులున్నారు. బీసీ సంక్షేమ శాఖలో మొత్తం 15 వార్డెన్లకు 11 మంది మాత్రమే ఉన్నారు. నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

నమ్మకాన్ని నిలబెట్టేలా వసతిగృహాల నిర్వహణ ఉండాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే •7లో..

కొండపై తికమక

- భక్తులకు అందని సేవల వివరాలు
- మాస్టర్‌ప్లాన్‌లో కనిపించని డోనర్ సెల్ కౌంటర్
- ప్రచారశాఖ ప్రదేశం కౌంటర్ వద్దా?



కొండపైన తిరవీధుల్లో భక్తులు(ఫైల్)

యాదగిరీశా శరణు 3

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 6: స్వయంభూ పాంచ నారసింహకొండపై సేవల వివరాలు తెలిసేదెలా? అని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ఉద్ఘాటన అనంతరం హరిహరులను దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు కొండపై ఎదుర్కొంటున్న ఇబ్బందులు అనేకం ఉన్నాయి. కొండకింద బస్టాండ్‌లో దిగినప్పటినుంచి భక్తుల యాతనలు ఆరంభమవుతున్నాయి. గండిచెరువు సమీపంలోని బస్టాండ్‌లో దిగితే బస, వసతి సౌకర్యాలకోసం కిలోమీటర్ల మేర కొండకిందకు తిరిగి రావాల్సి ఉంటుంది. కేవలం దర్శనాల కోసమైతే బస్సు దిగిన వెంటనే టెంపుల్ బస్ టెర్మినల్‌లో కొండపైకి బస్సులు సిద్ధంగా ఉంటాయి. ఇక్కడే ఉన్న కల్యాణకట్టలో తలనీలాలు అందజేసి లక్ష్మీపుష్కరిణిలో స్నానాలు ఆచరించి కొండపైకి వెళ్లాలి. అయితే కొత్తగా కొండకు వచ్చిన భక్తులకు ఇవేమీ తెలియక, చెప్పేవారు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొండపైకి వచ్చినా ఎక్కడా సూచీబోర్డులు, భక్తులకు సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు విచారణ కార్యాలయం సైతం లేవు. యాదగిరీశుడి సన్నిధిలో భక్తులు అధికసంఖ్యలో శాశ్వత కైంకర్యాల టికెట్లు పొందుతారు. భక్తులు తమకు అనుకూలమైన, విశేష రోజుల్లో ఆయా ఆర్జిత సేవలను నిర్వహించుకునే అవకాశం ఉంటుంది. అయితే ఈ సేవను పొందేందుకు భక్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత పూజల వివరాలు తెలియజేసేందుకు శాశ్వత కార్యాలయాన్ని కొండపైన నిర్మించకపోవడమే ఈ దుస్థితికి కారణమైంది. అదేవిధంగా సెంట్రల్ బుకింగ్ కౌంటర్, వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి, స్వామివారి ఫొటోలు, క్షేత్ర చరిత్రను తెలియజేసే పుస్తకాలు విక్రయించే ప్రచారశాఖ, విచారణ కార్యాలయాల భవనాలు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని మరింత బహిర్గతం చేస్తోంది. యాదగిరికొండకు విచ్చేసే భక్తులు పొందాల్సిన కనీస సౌకర్యాలనే విస్తరణ పర్వంలో మరవడం పట్ల భక్తులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాస్టర్ ప్లాన్‌లో కనిపించని డోనర్ సెల్ కౌంటర్

యాదగిరీశుడి దర్శనాల అనంతరం భక్తులు శాశ్వత మొక్కు పూజా టికెట్లు, అన్న ప్రసాదాలు తదితర విభాగాలకు విరాళాలు అందజేసేందుకు ఆసక్తి చూపుతారు. అలాంటి పూజల కార్యాలయం(డోనర్ సెల్ కౌంటర్)కోసం యాదాద్రి ఆలయ మాస్టర్‌ప్లాన్‌లో ఎలాంటి ప్రణాళికలు పొందుపరచకపోవడం గమనార్హం. స్వామికి భక్తులు హుండీల ద్వారానే కాకుండా విరాళాల రూపంలోనూ నగదు, నగలను అందజేస్తుంటారని తెలిసినా, అధికారులు మాస్టర్‌ప్లాన్‌లో విస్మరించడం గమనార్హం. నిజాం పరిపాలనా సమయం నుంచే విరాళాల సేకరణకు కొండపైన ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉండేవి. ఆదాయ వనరులు సమకూర్చే విభాగాల్లో శాశ్వత పూజల కార్యాలయానిది సింహభాగం. ఈ విభాగం లేకపోవడంతో ఆలయ పునర్నిర్మాణంపై కనీస అవగాహనలేని వ్యక్తులకు పనులు అప్పగించారని భక్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. శాశ్వత కార్యాలయ నిర్మాణాన్ని అధికారులు ఎలా మరిచారని భక్తులు వాపోతున్నారు. కనీసం ఆలయ పునర్నిర్మాణం పూర్తయిన తర్వాతనైనా శాశ్వత పూజల కార్యాలయానికి శాశ్వత భవనం కోసం ఏర్పాట్లు చేపట్టకపోవడంపై మండిపడుతున్నారు. పదుల సార్లు సీఎం, సీఎంవో సెక్రటరీతో పాటు వైటీడీఏ అధికారులు ఆలయ పునర్నిర్మాణ పనులను పర్యవేక్షించిన తరుణంలో కొండపైన శాశ్వత పూజల కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మాణం గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడంపై కొండపైన ఏ నిర్మాణం ఎక్కడ ఉండాలనే సునిశిత అంశాన్ని మరిచినట్లు తేటతెల్లమవుతోంది. ఇక ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ఈ శాశ్వత పూజల కార్యాలయం తాత్కాలికంగా బాలాలయం నుంచి బయటకు వచ్చే దారిలో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తాత్కాలిక బాలాలయం నిర్మాణ సమయంలో గుర్తించిన అధికారులు శాశ్వత కట్టడాలు పూర్తయ్యాక కూడా విస్మరించారని విమర్శలు వినిపిస్తున్నాయి. శాశ్వత పూజల కార్యాలయం అవసరాన్ని గుర్తించిన అధికారులు అష్టభుజి ప్రాకార పడమటి దిశలో తాత్కాలిక ఏర్పాట్లతో డోనర్ సెల్ ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది.

ప్రచారశాఖ ప్రదేశం కౌంటర్ వద్దా?

యాదగిరికొండపైన స్వామివారి ఫొటోలు, క్షేత్ర మహత్యాన్ని తెలియజేసే గ్రంథాలతో పాటు ఇతర ఆధ్యాత్మిక పుస్తకాలు, స్వామివారి బంగారు, వెండి లాకెట్‌లు, క్యాలెండర్ తదితరాలను తొలి నాళ్లనుంచే ప్రచారశాఖ కౌంటర్ ద్వారా భక్తులకు విక్రయిస్తున్నారు. అటువంటి ప్రచారశాఖ కౌంటర్‌కు కొండపైన సరైన ప్రదేశమే లేదంటే ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ కౌంటర్ ద్వారా సైతం దేవస్థానానికి ఆదాయం సమకూరుతుందని తెలిసినా అధికారులు ఆలయ పునర్నిర్మాణంలో మరిచిపోవడం విశేషం.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేయాలి
- ఎమ్మెల్యే కుంభం అనిల్



సమీక్ష నిర్వహిస్తున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 6: గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లిలోని రూరల్ టూరిజం సెంటర్‌లో ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం పనిచేసి, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన పనులపై ప్రగతి నివేదికలు, ప్రస్తుతం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మూసీ పరివాహక ప్రాంతమైన పోచంపల్లి మండల పరివాహకంలోని రైతాంగానికి సాగునీరు అందించడంలో విఫలమైందన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు సాగు, తాగునీటి సమస్యతోపాటు రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామని అన్నారు. స్వామి రామానందతీర్థ గ్రామీణసంస్థ (ఎస్ఆర్‌టీఆర్ఐ)ను స్కిల్ యూనివర్సిటీగా అభివృద్ధి చేసేందుకు సీఎం ప్రకటించడం హర్షనీయమన్నారు. కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామియాదవ్, కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారులతోపాటు ఎంపీడీవో ఎ బాలశంకర్, తహసీల్దారు బి వీరాబాయి, పంచాయతీరాజ్ శాఖ డీఈ గిరిధర్, ఏఈ వెంకటేశం, ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటీఈ దీన్‌దయాల్, ఏఈ అనూష, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఎంపీవో మాజిద్, విద్యుత్ శాఖ ఏఈ క్రాంతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేశంయాదవ్, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఆల్డా చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా

గొంగిడి దంపతుల అవమానాలు తట్టుకోలేకే చేశానని వెల్లడి



బీఆర్ఎస్‌కు చేసిన రాజీనామా పత్రాన్ని చూపుతున్న ఆల్డా చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 6: ఉమ్మడి నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ(ఆల్డా) చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి మంగళవారం రాజీనామా చేశారు. మంగళవారం తన స్వగ్రామమైన ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తాను ఉద్యోగ బాధ్యతలో ఉన్నప్పటికీ 2001నుంచి టీఆర్ఎస్ పార్టీకి సేవలు అందించానని, 2011లో టీఆర్ఎస్‌లో చేరానని తెలిపారు. 2014లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో మొదటిసారిగా గొంగిడి సునీతను ఎమ్మెల్యేగా గెలిపించడానికి తనకు అప్పగించిన ఎన్నికల సభలు, ఇన్‌చార్జీల బాధ్యతలను సమర్థంగా నిర్వహించి, పార్టీని విజయం వైపు నడిపించి సునీతను గెలిపించడంలో తానేంటో నిరూపించుకున్నానని తెలిపారు. రెండోసారి సునీతను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి దంపతుల ఇద్దరి ప్రవర్తనలో ముఖ్యంగా మహేందర్‌రెడ్డిలో చాలా మార్పు వచ్చిందన్నారు. గత ఐదు సంవత్సరాలనుంచి అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో మహేందర్‌రెడ్డికి పెద్దపెద్ద ఫ్లెక్సీలు పెట్టాలని అతడి ప్రచారం కోసం సభలకు ఖర్చులు పెట్టుకున్నకొత్తవారికే పార్టీలో గుర్తింపు ఇచ్చారని తెలిపారు. పార్టీలో మహేందర్‌రెడ్డి అహంభావ ప్రవర్తనతో ఎంతోమంది ప్రజాప్రతినిధులు, అధికారులు ఆర్థికంగా చితికిపోయారన్నారు. మహేందర్‌రెడ్డి సెకండ్ క్యాడర్‌ను పార్టీనుంచి బయటకు పంపించడానికి అనేక పరిస్థితులను సృష్టించేవాడన్నారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతకు తన భర్త మహేందర్‌రెడ్డి కంటే అహంభావం ఎక్కువ అన్నారు. ఆమె ఎమ్మెల్యేగా 10 ఏళ్లలో నియోజకవర్గంలో ఎన్ని కుటుంబాలను ఆదుకున్నారో చెప్పాలన్నారు. పొమ్మనలేక పొగ పెట్టినట్లు తనను పార్టీనుంచి బయటకు పంపడానికి మహేందర్‌రెడ్డి చేసిన అవమానాలను తట్టుకోలేక పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. తన రాజీనామ లేఖను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డికి పంపుతున్నట్లు తెలిపారు. పిచ్చిరెడ్డితోపాటు మదర్ డైరీ మాజీ డైరెక్టర్ మోతె పూలమ్మ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బెజ్జంకి బిక్షం, బీసీ సెల్, ఎస్సీసెల్ మండల ప్రధాన కార్యదర్శులు బాషబోయిన లింగయ్య, ఉప్పల నర్సింహులు పార్టీకి రాజీనామా చేశారు.

యాదగిరీశుడి సన్నిధిలో ఏకాదశి లక్షపుష్పార్చనలు

● క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 6: ఏకశిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీన రసింహస్వామి సన్నిధిలో మంగళవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా లక్షపుష్పార్చన పూజలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులను పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి స్వర్ణసింహాసనంపై అధిష్ఠింపజేశారు. స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో అర్చకస్వాములు, వేదపండితులు వివిధ రకాల పుష్పాలతో లక్షపుష్పార్చన పూజలు చేశారు. సుమారు రెండు గంటలపాటు పుష్పార్చన పర్వాలు కొనసాగగా.. పుష్పార్చనలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు, ఆశీస్సులు అందజేశారు. ప్రాకార మండపంలో హోమం, నిత్య తిరుకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా క్షేత్రపాలకుడు ఆంజనేయుడికి విశేషపూజలు కొనసాగాయి. కొండపైన ప్రధానాలయం, విష్ణు పుష్కరిణి, శివాలయం, పాతగుట్ట ఆలయాల్లోని ఆంజనేయస్వామిని కొలుస్తూ అర్చకులు వేదమంత్రపఠనాలతో అభిషేకించి నాగవల్లీదళాలతో అర్చించారు. శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యారాధనలు, యాగశాలలో నిత్యరుద్రహవనం స్మార్త సంప్రదాయరీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.17,70,079 ఆదాయం సమకూరిందని, సుమారు 10వేల మందికి పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించినట్లు అధికారులు తెలిపారు.



యాదగిరిగుట్ట ప్రధానాలయంలో లక్ష్మీనృసింహుడికి లక్షపుష్పార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ఆర్ఆర్ఆర్‌లో భూమి పోతుందని మనస్తాపం

● గుండెపోటుతో రైతు కన్నుమూత
● యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఘటన


నర్సిరెడ్డి (ఫైల్ ఫొటో)

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 6: రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణంలో భూమి కోల్పోతున్నామనే మనస్తాపంతో ఓ రైతు గుండె ఆగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెం గ్రామానికి చెందిన మామిడి నర్సిరెడ్డి (70)కి గ్రామపరిధిలో ఎనిమిది ఎకరాల్లో వరి సాగుచేస్తున్నాడు. ఐదు దశాబ్దాలుగా తన భూమిని సాగుచేసుకుంటూ కుమారుడు, కుమార్తెలకు వివాహాలు చేశాడు. కుమారుడు, భార్యతో కలిసి ఇంట్లోనే ఉంటున్నాడు. ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో భాగంగా మొదటి దశలో గజ్వేల్ నుంచి చౌటుప్పల్ వరకు భూమిని సేకరించేందుకు ఏడాది క్రితం నోటిఫికేషన్ జారీచేశారు. ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో మందోళ్లగూడెం గ్రామానికి చెందిన 15మంది రైతుల భూములు ఉన్నాయి. అందులో నర్సిరెడ్డికి చెందిన ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి నర్సిరెడ్డి మనోవేదన చెందుతూనే ఉన్నాడు. ఎక్కడ ఆర్ఆర్ఆర్ బాధితుల సమావేశాలు నిర్వహించినా నర్సిరెడ్డి హాజరయ్యేవాడు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని సహచర రైతులతో కలిసి అధికారులను, ప్రజాప్రతనిధులను కలిశాడు. భూసేకరణలో భాగంగా సోమవారం అటవీశాఖ అధికారులు నర్సిరెడ్డి పొలంలో చెట్లను లెక్కించారు. ఆర్ఆర్ఆర్‌లో భూమి త్వరలో పోతుందని ఫారెస్టు అధికారులు చెప్పడంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఆరుగాలం శ్రమించి కష్టపడి సంపాదించిన తన భూమి తన కళ్లెదుటే పోతుందని గ్రహించి, తీవ్ర మనస్తాపానికి గురై ఇంటికి వచ్చి కుప్పకూలిపోయాడు. అదే మనోవేదనతో ఉదయం నుంచి రాత్రి వరకు ఏమీ తినకుండా ఉండి మంచంలోనే కన్నుమూశాడు. భూమి కోల్పోతుండటంతోనే నర్సిరెడ్డి మృతిచెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. నర్సిరెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయలేదని మందోళ్లగూడెం మాజీ సర్పంచ్ బూరుగు కళమ్మ తెలిపారు.

పట్టభద్రుల ఓటుకు 4.30లక్షల దరఖాస్తులు

● గతంతో పోలిస్తే 70వేలు తగ్గిన ఓటర్లు
● వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్ర ఓటర్లకు ముగిసిన దరఖాస్తులు

నల్లగొండ, ఫిబ్రవరి 6: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి మంగళవారం సాయంత్రం వరకు ఓటు నమోదుకు 4.30లక్షలు దరఖాస్తులు వచ్చాయి. వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో ఎలక్షన్ సెల్‌ను ఏర్పాటుచేయగా, జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు 4.30లక్షల దరఖాస్తులు వచ్చినట్లు ఎలక్షన్ సెల్ అధికారి సమాచారమిచ్చారు. రాత్రి 12గంటల వరకు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండటంతో ఈ మూడు జిల్లాల్లో మరికొన్ని దరఖాస్తులు పెరిగే అవకాశాలున్నాయి. మంగళవారంతో దరఖాస్తుల గడువు ముగిసినప్పటికీ ఓటు నమోదుకు మళ్లీ గడువు పెంచుతారా? లేదా? చూడాల్సి ఉంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో 5.05లక్షల ఓటర్లు ఉండగా ఈసారి 70వేలకుపైగా ఓటర్లు తగ్గారు. గతంలో ఓటు వేసిన వారు కూడా తిరిగి మళ్లీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని, లేదంటే ఓటు హక్కు ఉండదని ఎన్నికల సంఘం ప్రకటించింది. అయినప్పటికీ ఓటు నమోదు చేసుకోవడానికి చాలామంది పట్టభద్రులు ఆసక్తి చూపలేదు.

ఆత్మహత్యల మిస్టరీని తేల్చండి

● భువనగిరిలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించిన రాజకీయ ప్రముఖులు
● ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో
● ఎస్ఎఫ్ఐ నిరసన సమావేశం


విద్యార్థినుల ఆత్మహత్య ఉదంతంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని భువనగిరిలో రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 6 : భువనగిరి ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులు భవ్యశ్రీ, వైష్ణవిల ఆత్మహత్య ప్రకంపనలు కొనసాగుతున్నాయి. ఆత్మహత్యకు దారితీసిన మిస్టరీని తేల్చాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. హత్యలా, ఆత్మహత్యలా తేల్చాలని, అందుకు బాధ్యులైన వారిని గుర్తించి శిక్షించాలని ఆందోళనలు మిన్నంటాయి. ఈ ఘటనపై అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రముఖులతో పాటు పలువురు హాస్టల్‌ను సందర్శించి, ఇద్దరు బాలికలకు నివాళులర్పిస్తూనే వసతుల దుస్థితిని పరిశీలిస్తూ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం భువనగిరిలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేయగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన సమావేశం నిర్వహించారు.

ఆత్మహత్యలపై సమగ్ర దర్యాప్తు జరపాలి


హాస్టల్ పక్కన ఉన్న ఐటీఐ విద్యార్థినులతో మాట్లాడుతున్న కవిత

భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్యలపై అనుమానాలున్నాయి. ఉన్నత భవిష్యత్ కోసం హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న వారు అనుమానాస్పదంగా మృతి చెందడం బాధాకరం. ఒకే రూంలో ఆత్మహత్యకు పాల్పడి నాలుగు రోజులు గడుస్తున్నా సాక్ష్యాధారాలు లభించలేదని పోలీసులు పేర్కొనడం దారుణం. వెలుపలి వ్యక్తులు హాస్టల్‌లోకి ప్రవేశించినట్లు తల్లిదండ్రులు పేర్కొంటున్నా ఆ దిశగా అధికారులు విచారణ చేపట్టకపోవడం అమానుషం. అద్దె భవనంలో కొనసాగుతున్న హాస్టల్ దుస్థితి, విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినుల కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది. ప్రభుత్వం కూడా ఆయా కుటుంబాలకు న్యాయం చేయాలి.

● కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్సీ

ఘటనపై ప్రభుత్వం స్పందించాలి


హాస్టల్ గదిని పరిశీలిస్తున్న శిల్పారెడ్డి

విద్యార్థినుల జంట ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించి కుటుంబాల్లో ఆవేదన మిగిల్చిన భవ్యశ్రీ, వైష్ణవిలు ఆత్మహత్య చేసుకొని నాలుగు రోజులు గడుస్తున్నా పాలకులు చూపుతున్న నిర్లక్ష్యం బాలికల సంక్షేమంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై ప్రభుత్వం విఫలమైంది. పేద విద్యార్థులు మాత్రమే సంక్షేమ వసతి గృహాల నిర్వహణను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోంది. ఎలాంటి భద్రతా, రక్షణ లేని భువనగిరి వంటి హాస్టల్స్ రాష్ట్రమంతటా ఉన్నాయి. భువనగిరిలో విద్యార్థినుల ఆత్మహత్యలపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపి దోషులను శిక్షించాలి. బాధిత కుటుంబాలను ఆదుకోవాలి.

● డాక్టర్ శిల్పారెడ్డి, బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు

విద్యార్థినులు పిరికివారు కాదు


హాస్టల్ గదిని పరిశీలిస్తున్న సంధ్య

భవ్యశ్రీ, వైష్ణవి క్లాస్ టాపర్స్ అని తమ హాస్టల్ పరిశీలనలో తేలింది. విద్యార్థినుల సమస్యలపై భవ్యశ్రీ వార్డెన్‌తో పాటు అధికారులను ప్రశ్నించేదని, ఆ అక్కసుతోనే ప్రాణ స్నేహితులైన ఇద్దరినీ అధికారులు, సిబ్బంది వేధించేవారని పలువురు అంటున్నారు. వారి ఆత్మహత్యలపై లోతైన విచారణ జరిపి అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులది. కానీ తమ పిల్లల ఆత్మహత్యలపై అనుమానాలు ఉన్నట్లు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులపై పోలీసులతో పాటు అధికారులు పూర్తిస్థాయిలో స్పందించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. ఇప్పటికైనా ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

● సంధ్య, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు.

నిర్వహణ నిర్లక్ష్యంతో ప్రాణాలు బలి

హాస్టల్ నిర్వహణలో వార్డెన్‌తో పాటు సిబ్బంది, సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యమే భవ్యశ్రీ, వైష్ణవి ప్రాణాలను బలితీసుకున్నాయి. విద్యార్థినుల మానసిక స్థితిని గుర్తించి కౌన్సిలింగ్ చేయడంలో హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయులు విఫలమయ్యారు. దాంతో మనోవైదనకు గురై విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో తప్పనిసరిగా మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులతో మోటివేషన్ తరగతులు నిర్వహించాలి. జంట ఆత్మహత్యల కారకులను గుర్తించి, శిక్షించాలి. హాస్టల్ నిర్వహణలో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయాలను అరికట్టాలి. మితిమీరిన జోక్యంపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఉంటే విద్యార్థినుల ప్రాణాలు నిలిచేవి.

● ఝాన్సీ, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి

దోషులను కఠినంగా శిక్షించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి

భువనగిరిలో జంట ఆత్మహత్యల ఘటనకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలి. ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య చేసుకొని నాలుగు రోజులు గడుస్తున్నా హాస్టల్ వార్డెన్, సంబంధిత శాఖ అధికారులపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. విద్యార్థినుల ఆత్మహత్యకు కారకులెవరు, హాస్టల్ సిబ్బందిని కాపాడుతున్నదెవరో తేలాల్సి ఉంది. ఈ మేరకు ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తాం. ఆత్మహత్య చేసుకున్న భవ్యశ్రీ, వైష్ణవి పేద, బలహీన వర్గాలకు చెందిన వారు కావడంతోనే దర్యాప్తులో వేగం మందగించింది. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి.

● ఆర్ఎల్ మూర్తి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు

నమ్మకాన్ని నిలబెట్టేలా హాస్టళ్ల నిర్వహణ ఉండాలి

యాదాద్రి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టేలా హాస్టళ్ల నిర్వహణ ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగే హెచ్చరించారు. మంగళవారం కాన్ఫరెన్స్‌హాలులో ప్రభుత్వ హాస్టళ్ల వార్డెన్లు, సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో స్నేహపూర్వక వాతావరణంలో, ఆరోగ్యకరమైన అంశాలను పంచుకుని, విద్యార్థులకు గార్డియన్‌గా ఉండాలన్నారు.వెనుకబాటు ఉన్న విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వార్డెన్లు చేసే పని సేవాభావంగా భావించాలన్నారు. అబ్‌నార్మల్‌గా ఉన్న విద్యార్థుల విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపి ప్రత్యేకంగా మాట్లాడాలన్నారు. తరుచూ పేరెంట్స్‌తో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు ఇచ్చే ఫిర్యాదులపై అలక్ష్యం చేయవద్దని, ఫిర్యాదులను విచారించాలన్నారు. తీవ్రమైన ఫిర్యాదులను అసలు తిరస్కరించకూడదని, అదేవిధంగా సిబ్బంది ప్రవర్తనను పరిశీలిస్తుండాలని సూచించారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత ఎవరినీ హాస్టళ్లలోకి అనుమతించవద్దని ఆదేశించారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, ఎ.భాస్కర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, బీసీ, మైనార్టీ శాఖ అధికారి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

దొంగలను పట్టించిన కుక్కలు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 6: ధాన్యం దొంగతనం చేసేందుకు యత్నించిన దొంగలను కుక్కలు పట్టించాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని తెప్పలమడుగు స్టేజీవద్ద ఉన్న రైస్‌మిల్లులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సాగర్ సీఐ భీసన్న, పెద్దవూర ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... పెద్దవూర మండల పరిధిలోని తెప్పలమడుగు స్టేజీ వద్ద ఉన్న అమ్మ రైస్ మిల్లులో ఎఫ్‌సీఐకి చెందిన ధాన్యాన్ని మూడు లాట్లుగా నిల్వ చేశారు. ఈ నెల 4వ తేదీ ఆదివారం తెల్లవారుజామున నిడమనూరు మండలం నర్సింహులగూడేనికి చెందిన రమేష్, అనుముల మండలం చెల్మారెడ్డిగూడేనికి చెందిన శ్రీకాంత్ తన స్నేహితుడైన శ్రీరాం జీవన్ వద్ద నుంచి ఆటోను అడిగి తీసుకున్నారు. వారు అక్కడి నుంచి నేరుగా తెప్పలమడుగు స్టేజీ వద్ద ఉన్న అమ్మ రైస్‌మిల్లు వద్దకు చేరుకున్నారు. రైస్‌మిల్లు లాట్‌లో ఉన్న ధాన్యం బస్తాలను లాగడంతో రెండు బస్తాలు కిందపడిపోయాయి. అక్కడున్న కుక్కలు మొరగడంతో వాచ్‌మన్ లేచి చూశాడు. ఎన్‌హెచ్-167 పక్కనే ఉన్న ఆ రైస్‌మిల్లు వద్ద రోడ్డుపై ఆటో ఆగి ఉండడాన్ని గమనించాడు. అతను కేకలు వేయడంతో నిందితులు ఆటోను అక్కడే వదిలి పరారయ్యారు. సోమవారం ఉదయం రైస్ మిల్లు యజమాని మలిగిరెడ్డి రామాంజిరెడ్డికి వాచ్‌మన్ సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన ఎస్ఐ రమేష్ ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం అదే రైస్ మిల్లు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. ధాన్యం బస్తాలు దొంగతనం చేసేందుకు వచ్చింది తామేనని ఒప్పుకున్నారు. ఇద్దరు నిందితును మంగళవారం నిడమనూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లి చేతిలో కుమారుడు మృతి


రమేష్(ఫైల్)

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 6 : మద్యం మత్తులో దాడి చేస్తున్న కుమారుడిపైకి తల్లి తిరగబడింది. ఆ దాడిలో కుమారుడు మృతి చెందాడు. సోమవారం రాత్రి నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఈ సంఘటన జరిగింది. సాగర్ సీఐ భీసన్న, ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం సాగర్ పైలాన్‌కాలనీకి చెందిన అవివాహితుడైన సామల రమేష్(45) లారీక్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రమేష్‌కు గతంలోనే తండ్రి చనిపోగా తల్లి బాలమ్మతో పాటు ఇద్దరు చెల్లెలు సుశీల, సునీత ఉన్నారు. రమేష్ రోజూ మద్యం మత్తులో ఇంటికి వచ్చి తల్లితో పాటు చెల్లెళ్లను వేధిస్తుండేవాడు. వారం రోజుల క్రితం లారీక్లీనర్‌గా విధులు ముగించుకుని వచ్చి ఇంట్లో గొడవ చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఉన్న రమేష్ ఇంట్లో నిద్రిస్తున్న తల్లి బాలమ్మ గొంతుపై కాలు పెట్టి తొక్కుతుండగా గమనించిన ఇద్దరు చెల్లెళ్లు అన్నను వారించి లాగగా, వారిని వెనక్కు నెట్టేశాడు. ఈక్రమంలో తేరుకుని పైకి లేచిన తల్లి పక్కనే ఉన్న ఇనుప రాడ్డుతో కుమారుడి తలపై మోదింది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో తల్లి, చెల్లెళ్లు పక్కింట్లో తలదాచుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 6: బీబీనగర్ ఎయిమ్స్, యాదగిరిగుట్ట దేవస్థానం, జిల్లాలోని పలు పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాలు డిమాండ్ చేశాయి. కలెక్టరేట్ వద్ద సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టిన అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘాల జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ నిరుద్యోగ భృతి అమలు చేయాలన్నారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలను నిర్మూలించాలన్నారు. జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాలను నెలకొల్పి, యాదగిరిగుట్ట ఆలయ నిధులతో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించి, భువనగిరి ఎస్సీ వసతి గృహంలో జరిగిన జంట ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వస్తావుల అభిలాష్, ఉప్పుల శాంతికుమార్, ఎండీ నహీం, సుద్దాల సాయి, సురారం జానీ, కంబాల వెంకటేష్, రాజు, మారుపాక లోకేష్, ఎం. జానీ, దినేష్, కల్యాణ్, సాయి, చరణ్, సుమన్, ప్రవీణ్, ప్రణయ్, రవితేజ ఉన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి



పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 6: ఆలేరులో ఏర్పాటు చేసిన మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి . జహంగీర్ అన్నారు. మంగళవారం ఆయన ఆ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఐదు ఎకరాల స్థలంలో సొంత భవనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అరకొర వసతుల మధ్య రేకుల షెడ్డులో గురుకులం కొనసాగడం బాధాకరమన్నారు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా రాణించాలంటే అన్ని రకాల సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత పాలకులదేనన్నారు. టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలని, కనీస వేతన చట్టం ప్రకారం రూ.26వేలు ఇచ్చి పర్మినెంట్ చేయాలన్నారు. ఆయనతో పాటు సీపీఎం జిల్లా, మండల, పట్టణ నాయకులు మాటూరి బాలరాజు, ఎంఏ.ఇక్బాల్, మొరిగాడి రమేష్, గణేష్, నరేష్, రాజేశ్ ఉన్నారు.

ఉపాధి పనులు 200రోజులకు పెంచాలి



కలెక్టర్ కు వినతి పత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 6: వంద రోజుల నుంచి 200రోజులకు ఉపాధి హామీ పథకంలోని పనులను పెంచాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతు కే. జెండగేను కలిసి సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజుకు రూ. 600ల కూలి ఇచ్చి ఉపాధి పనులను పట్టణాలకు విస్తరించాలన్నారు. పని ప్రదేశాల్లో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, 2009 సంవత్సరం నుంచి మహిళ వద్ద అప్పటి ప్రభుత్వం సేకరించిన అభయహస్తం డబ్బులను తక్షణమే తిరిగి ఇచ్చి కొత్త రేషన్‌కార్డులు అందివ్వాలన్నారు. గత ప్రభుత్వం అభయహస్తం డబ్బుల పట్ల నిర్లక్ష్యం చేసిందని, తక్షణమే ఆ బకాయి డబ్బులు మహిళల బ్యాంకు అకౌంట్‌లో జమ చేయాలన్నారు. వీటితో పాటు పెన్షన్ కోసం దరఖాస్తుల చేసుకున్న మహిళల కోసం వెంటనే మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకురాలు కల్లూరి నాగమణి, మాయ రాణీ, సునీత పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి



కోర్టుకు హాజరైన ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 6: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఉద్యమాలను సాగిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తి వేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె మధు కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె శివకుమార్ డిమాండ్ చేశారు. చౌటుప్పల్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఏడు సంవత్సరాల క్రితం అప్పటి సీఎం కేసీఆర్‌కు వినతి పత్రం అందజేసేందుకు వెళ్లిన డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు పల్లె మధు, పల్లె శివ, దొడ్డి లింగస్వామి, ఆవుల శివాజీ, చీమకండ్ల మధు, పబ్బు శివ, కునూరు గణేష్, నత్తి నరేష్, బత్తుల వేణు, చిన్నం సాయి, బాల్యం నరేష్, దొంతగోని అమరేందర్, మాదగోని కిరణ్, పబ్బు నవీన్, అరూరి నితిన్, బొమ్మకంటి వినోద్ పై కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి 16 మంది మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పరిశీలించి ఎత్తివేయించాలని వారు కోరారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు చౌటుప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, కళాశాలను ఏర్పాటు చేసేంత వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

ఆందోల్‌మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 6: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శ్రీ ఆందోల్‌మైసమ్మ దేవాలయ హుండీ లెక్కింపు మంగళవారం దేవాలయంలో ఆవరణలో నిర్వహించారు. 134 రోజులకు గాను రూ.14లక్షల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ కే.మహేందర్‌కుమార్, ఆలయ కార్యానిర్వహణాధికారి ఎం.మోహన్‌బాబు పాల్గొన్నారు.

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతా

• ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 6: యాదగిరిగుట్ట పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం గుట్ట మునిసిపల్ పరిధిలోని 4వ వార్డులో సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజ్ మురికి కాలువల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ప్రత్యేక నిధులను సేకరించి, సుందరంగా రూపురేఖలు ఉండే విధంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. గత ప్రభుత్వం కేవలం కొండపైన మాత్రమే అభివృద్ధి పనులు చేసిందని, పట్టణ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్ట ఆలయంతో పాటుగా శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శనార్థం వచ్చి వెళ్లే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తానని అన్నారు. యాదగిరిపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో విప్‌ను పూలమాల, శాలువాతో సన్మానించారు. గౌడసంఘం భవన నిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, వైస్ ఛైర్మన్ కాంటంరాజు కౌన్సిలర్లు సీస విజయలక్ష్మీకృష్ణాగౌడ్, ముక్కెర్ల మల్లేశం, గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, గౌళికార్ అరుణారాజేష్, దండెబోయిన అనిల్, బిట్టు సరోజహరీష్, నాయకులు ఎరుకల హేమేందర్‌గౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, బందారపు బిక్షపతిగౌడ్, గౌడ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సీస కృష్ణగౌడ్, మిట్ట చిన్న వెంకటయ్య, భీమగాని మల్లేశ్ పాల్గొన్నారు.

బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకుడు బాల్కసుమన్ చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన బేషరతుగా సీఎంకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం గుట్టలో ఆయన మాట్లాడుతూ స్థాయిని మరచి బాల్క సుమన్ సీఎంపై అనుచిత వాఖ్యలు చేయడం తెలంగాణ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ఇలాంటి వాఖ్యలు చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. చౌకబారు మాటలు మానుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ప్రభుత్వ విప్‌పై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య చేసిన వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతిగౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్ హెచ్చరించారు. గుట్టలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థాయిని మించి వెంకటయ్య మాట్లాడం సిగ్గుచేటని, మాటలు మానకుంటే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినప్పటికీ మార్పు రాలేదని, ప్రభుత్వ విప్‌ను విమర్శించడం సహించబోమని, విధానం మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం పట్టణంలో బాల్క సుమన్ గడ్డిబొమ్మను ఊరేగిస్తూ దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంపై బాల్క సుమన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం



ఆలేరులో సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ వ్యాఖ్యలు అభ్యంతరకమని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. సుమన్ నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సుమన్ దిష్టిబొమ్మలను దహనం చేసి, నిరసన తెలిపారు. భువనగిరిలో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో మునిసిపల్ మాజీ ఛైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఈరపాక నర్సింహ, ఖైరంకొండ వెంకటేష్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బర్రె నరేష్, మంగ ప్రవీణ్, ఎండి.అవేజ్ చిస్తీ, ఎండి అబేద్ అలీ తదితరులు పాల్గొన్నారు. అలాగే బాల్క సుమన్‌పై పట్టణ పోలీసులకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఆలేరు, మోత్కూరు, భూదాన్‌పోచంపల్లి, అడ్డగూడూరు, మోటకొండూరు, రాజాపేట మండల కేంద్రాల్లో సుమన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మోత్కూరు, ఆలేరు మండల కేంద్రాల్లో సుమన్‌పై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

ఇక్కత్ పట్టుచీరలకు ఖండాంతర ఖ్యాతి



చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 6: పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టుచీరలకు ఖండాంతర ఖ్యాతి ఉందని, నేటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా అధునాతన డిజైన్లతో, నవ్యత, నాణ్యతతోకూడిన వస్త్రాలను తయారు చేయాల్సిన అవసరం ఉందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) హైద్రాబాద్‌కు చెందిన విద్యార్థులు అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని రూరల్ టూరిజం సెంటర్ మ్యూజియంలోని 'లీవ్‌టుక్లాత్' ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత మగ్గాలను సందర్శించి కార్మికుల నైపుణ్యాన్ని పరిశీలించి వారి ప్రతిభను ప్రశంసించారు. కేంద్ర మంత్రిత్వ చేనేత, జౌళీశాఖ ఆదీనంలోని నిఫ్ట్ సంస్థ నిర్వహించే అధ్యయనంలో 40 మంది విద్యార్థులు 'మాస్టర్స్ ఇన్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్' ఆధ్వర్యంలో మూడు అధ్యయన బృందాలుగా ఏర్పడి వరంగల్, యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లితోపాటు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నట్లు హెచ్‌వోడీ రాజ్యలక్ష్మీ తెలిపారు. పర్యటన అనంతరం తాము నివేదికను తయారుచేసి కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ ఆదీనంలోని నిఫ్ట్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని ఆమె తెలిపారు.

మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్వీఎస్ఎస్.ప్రభాకర్

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 6: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని మూడోసారి ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి ఎన్వీఎస్ఎస్.ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, జి.మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం భువనగిరిలో జరిగిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలో మూడోసారి కొలువుదీరనున్న మోదీ ప్రభుత్వంలో భువనగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం దక్కడం ఖాయమన్నారు. అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో శ్రమించాలన్నారు. అయోధ్య ఆలయ నిర్మాణం, దేశ ప్రజల స్వాభిమానానికి నిదర్శనంగా నిలిచిందని, విశ్వకర్మ యోజన, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలు ప్రజల అవసరాలను తీరుస్తున్నాయన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, బందారపు లింగస్వామి, మోహన్ రెడ్డి, వేముల అశోక్, జగన్మోహన్‌రెడ్డి, చిక్క కృష్ణ పాల్గొన్నారు. కాగా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న ఆశావాహుల అభిప్రాయాలను ఆ పార్టీ రాష్ట్ర పరిశీలకులు ఆకుల లలిత, ఓ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం భువనగిరిలో సేకరించారు.

సంక్షిప్త సమాచారం...

చౌటుప్పల్ టౌన్/చౌటుప్పల్ మునిసిపాలిటీ : విద్యార్థినులు ఆరోగ్యవంతంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని తంగడపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కాటం రాజు అన్నారు. చౌటుప్పల్ లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల అండ్ జూనియర్ కళాశాలలో మంగళవారం దివీస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైన విద్యార్థినులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. 652 మంది విద్యార్థినులకు రూ. 5.30 లక్షల విలువైన స్కూల్ బ్యాగులు, పాదరక్షలు, మందులను అందజేశారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రానికి చెందిన ఎద్దు వెంకటేశ్వర్లు కాంగ్రెస్ ఫిషర్‌మెన్ మండల చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా దండు రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సత్తయ్య, కార్యదర్శిగా ఉపేందర్ ఎన్నికయ్యారు.

ఆత్మకూరు(ఎం) : శ్రీ రామలింగేశ్వర కళానాట్యమండలి అధ్యక్షుడిగా పైళ్ల దామోదర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దామోదర్‌రెడ్డిని అభినందించి, సన్మానం చేశారు.

యాదగిరిగుట్ట: యాదగిరికొండపైన వర్తక సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆ సంఘం నూతన అధ్యక్షుడు గడ్డమీది మాధవులుగౌడ్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కొండపైన వర్తక సంఘం నూతన కమిటీని గౌరవ సలహాదారులు తడ్క వెంకటేష్, ఖైరంకొండ నవీన్‌లు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన కమిటీలో గౌరవ సలహాదారుగా రమేశ్, అధ్యక్షుడిగా మాధవులుగౌడ్ ఎన్నికయ్యారు.

భూదాన్‌పోచంపల్లి : కల్వర్టు కూలడంతో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి లారీ బోల్తాపడింది. భూదాన్‌పోచంపల్లి మండలం జగత్‌పల్లి గ్రామశివారులో ఈ సంఘటన చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ చాకచక్యత వల్ల ప్రమాదం తప్పింది.

భువనగిరి రూరల్: తల్లిదండ్రులను మించిన దైవం లేదని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మాసన చెన్నప్ప అన్నారు. మండలంలోని వీరవెల్లిలో కస్తూని అంజన్‌దాస్ 19వ ఆరాధనోత్సవం సందర్భంగా మాతృ, పితృ జ్ఞాన మందిరంలో ఆధ్యాత్మిక సభలో ఆయన మాట్లాడారు.

మోటకొండూర్ : జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థినుల ఆత్మహత్యలపైన రాష్ట్ర ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేష్, బొట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

భువనగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరూ తోడ్పాటునందించాలని అదనపు కలెక్టర్ గంగిరెడ్డి వీరారెడ్డి అన్నారు. భువనగిరి శివారులోని రాయిగిరి జడ్పీ హైస్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్న 245 మంది బాల బాలికలకు సేవా భారత్ ఆధ్వర్యంలో బాదం పాల సీసాలను అందజేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, డీఈవో డాక్టర్ కె.నారాయణరెడ్డి, స్థానిక కౌన్సిలర్ నాయిని అరుణ చందర్, హెచ్ఎం ఎస్.అండాలు, సేవా భారత్ అధ్యక్షుడు గట్టు శంకర్, శ్రావణి, ప్రవీణ్, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, పి.ప్రభాకర్, ఎం.విజయ ఉన్నారు.

మోత్కూరు : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 7న మధ్యాహ్నం 1 గంటకు తుంగతుర్తిలో బీఆర్ఎస్ తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నారని ఆ పార్టీ మోత్కూరు మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్ తెలిపారు.

మోత్కూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాతంత్ర వాదులు నిర్వహిస్తున్న పోరాటాలలో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపునిచ్చారు. మండలంలోని పాలడుగులో జరిగిన సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మోటకొండూర్ : గ్రామాల్లోని ప్రజలు ఉచిత దంత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దంత వైద్యాధికారి సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాటేపలి గ్రామంలో పాటి నర్సిరెడ్డి, వీరమల్లమ్మ జ్ఞాపకార్థంగా సంధ్య డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.

తుర్కపల్లి: మండల కేంద్రానికి చెందిన పెండెం ఆకర్ష్ గోవాలో జరిగిన నేషనల్ థైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడంపై కలెక్టర్ హనుమంత్ కే.జెండగే కలెక్టరేట్ లో అభినందించారు. జనవరి 28, 29 తేదీల్లో గోవాలో జరిగిన జాతీయ థైక్వాండో పోటీల్లో ఆకర్ష్ గోల్డ్ మెడల్ సాధించాడు.

భువనగిరి రూరల్: జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో దివ్యబాల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ కాట రాజులు తెలిపారు. ఈ నెల 4, 5 తేదీల్లో భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీలలో నైపుణ్యం కనబర్చిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ కాట రాజు అభినందించారు.

భువనగిరి రూరల్: సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందంజలో ఉందని రోటరీ క్లబ్ భువనగిరి సెంట్రల్ అధ్యక్షుడు ఫక్కీర్ కొండల్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనంతారం ప్రభుత్వ పాఠశాలకు బద్దం రంగారెడ్డి సౌజన్యంతో రూ.60వేల విలువ గల డెస్క్ బెంచీలను బహూకరించారు.

వలిగొండ: భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో మృతి చెందిన భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్యలకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ రాష్ట్ర మహిళా కన్వీనర్ నోముల దీప్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ బాలిక మృతి విషయంలో ప్రభుత్వం విచారణలో అలసత్వం వహించడం దారుణమన్నారు. బాధ్యులైన వారిని గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వలిగొండ: మండలంలో కొనసాగుతున్న కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టళ్లను ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే సందర్శించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతోనే భువనగిరిలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు.

మునిసిపల్ సమావేశం వాయిదా



మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 6: ఆలేరు మునిసిపల్ చైర్మన్ సర్వసభ్య సమావేశం మంగళవారం చైర్మన్ సహా మెజార్టీ కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో వాయిదా పడింది. మునిసిపల్ సమావేశానికి ఐదుగరు కౌన్సిలర్లు హాజరు కాగా చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు మరో ఐదుగురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. సర్వ సభ్య సమావేశం ఎజెండా పంపించి చైర్మన్ హాజరు కాకపోవడంతో నిరసిస్తూ సమావేశానికి హాజరైన ఐదుగురు కౌన్సిలర్లు మునిసిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ సభ్య సమావేశం ఉందని ఎజెండా పంపించి మధ్యాహ్నం 12.30 గంటలు దాటినా అత్యవసర పని ఉందని చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు మిగతా కౌన్సిలర్లు రాకపోవడం ఆలేరు అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. సమావేశానికి హాజరైన వారిలో కౌన్సిలర్ కందుల శ్రీకాంత్ ఉండగా నిరసన తెలిపిన కౌన్సిలర్లు బేతి రాములు, చింతలపని సునీత, గుత్త శమంతారెడ్డి, సంగు భూపతి ఉన్నారు.

విదేశీ ఉద్యోగాలపై అవగాహన నేడు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 6: కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మగారాల శాఖల కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ టామ్‌కామ్ (ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్) జపాన్, జర్మనీల్లో నర్సింగ్ ఉద్యోగాలపై ఈ నెల 7వ తేదీన బీబీనగర్ ఎయిమ్స్‌లో ఈ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి పి.సాహితి తెలిపారు. 22 నుంచి 35 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులు గుర్తింపు పొందిన సంస్థల నుంచి ధ్రువపత్రాలు ఉండి, జర్మన్ భాషల్లో తర్ఫీదు పొందేందుకు ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని కోరారు. కొత్తవారు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జర్మన్ భాషపై నివాస శిక్షణతో పాటు పని చేసేందుకు అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలు టీవోఎంసీవోఎం ద్వారా ఎంపికైన వారికి అందిస్తారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 1.9 నుంచి 2.5లక్షలతో పాటు ఇతర అలవెన్స్‌లు, కుటుంబ వీసాలు పొందొచ్చన్నారు. పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నాయని, అర్హత, ఆసక్తిగలవారు 9908830438 సంప్రదించాలని, లేదా టీవోఎంసీవోఎం యాప్‌తో నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

గుండాల ఎంపీవో సస్పెన్షన్

భువనగిరి అర్బన్/ మోత్కూరు, ఫిబ్రవరి 6: గుండాల మండల పంచాయతీ అధికారి పి. జనార్దన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ మంగళవారం కలెక్టర్ హనుమంతు కే. జెండగే ఉత్తర్వులు జారీ చేశారు. గుండాల మండలంలోని మహిళా పంచాయతీ కార్యదర్శులను వేదిస్తున్నారనే అభియోగాల నేపథ్యంలో భువనగిరి డీపీవో నివేదిక అధారంగా విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్వర్వులు వెలువడ్డాయి. సస్పెన్షన్ కాలంలో మండల హెడ్‌క్వార్టర్ దాటి వెళ్లకూడదని ఉత్తర్వులో ఆదేశించారు.

బాణసంచా విక్రయిస్తున్న యువకులపై కేసు

చౌటుప్పల్ మునిసిపాలిటీ, ఫిబ్రవరి 6: అక్రమంగా బాణసంచా విక్రయిస్తున్న యువకులపై కేసు నమోదైంది. సీఐ వి.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణానికి చెందిన జెట్టి నవీన్, దయాకర్ చౌటుప్పల్ పట్టణం లో బేకరీ షాపు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా బేకరిలో బాణ సంచా విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో ఎస్‌ఓటి పోలీసులు దాడి చేసి బాణసంచాను పట్టుకున్నారు. అక్రమ వ్యాపారం చేస్తున్న దయాకర్ పరారీలో ఉండగా, జెట్టి నవీన్‌తో పాటు అక్రమంగా నిల్వ చేసిన బాణాసంచాను చౌటుప్పల్ పోలీసులకు అప్పగించారు. ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం

వలిగొండ, ఫిబ్రవరి 6: మతిస్థిమితం సరిగ్గా లేక రైలు కింద పడి ఒక వ్యక్తి మంగళవారం దుర్మరణం చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లేపల్లికి చెందిన రాంనర్సు (55) వృత్తిరీత్యా మెకానిక్. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. కాగా రైల్వే సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి రైల్వే పోలీసులు చేసుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. రామనర్సుకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న రైల్వే పోలీసు రజిత తెలిపారు.

వైద్యురాలిపై పోలీసులకు ఫిర్యాదు

చౌటుప్పల్ మునిసిపాలిటీ, ఫిబ్రవరి 6: అనారోగ్యంతో చికిత్స చేయించుకోవడానికి వెళ్లిన మహిళ ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లింది. ఈ విషయమై బాధితురాలి భర్త మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన పల్లె వసంత(34) అనారోగ్యంతో బాధపడుతోంది. గత నెల24న చౌటుప్పల్ పట్టణంలోని శ్వేతప్రియాంక ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లింది. అందులోని డాక్టర్ ప్రియాంక అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గత నెల 28న గర్భసంచి సర్జరీ చేశారు. ఆపరేషన్ చేసిన మూడు గంటల తర్వాత అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడకి వెళ్లేసరికి బాధితురాలు పూర్తిగా చలనం లేని స్థితిలోకి వెళ్లింది. చౌటుప్పల్‌లో జరిగిన సర్జరీ వికటించి కడుపులో రక్తం పేరుకుపోయిందని, క్రిటికల్ కేర్‌లో మరో సర్జరీ చేసి కడుపులో పేరుకుపోయిన రక్తం నిల్వను తీసివేశారని బాధితురాలి భర్త పేర్కొన్నాడు. ప్రస్తుతం కూడ బాధితురాలి పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని బాధితురాలి భర్త పల్లె లింగస్వామి చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో డాక్టర్ ప్రియాంకపై ఫిర్యాదు చేశారు. డాక్టర్ ప్రియాంకపై కేసు నమోదు చేసినట్లు సీఐ వి.అశోక్‌రెడ్డి తెలిపారు.

ప్లాట్లను గుంజుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

• భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుల ధర్నా



బాధితులను సముదాయిస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 6: నయీం పేరు చెప్పి తమ ప్లాట్లను దౌర్జన్యంగా లాక్కున్న దయాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ప్లాట్ యజమానులు డిమాండ్ చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 121 మంది బాధితులు మంగళవారం భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా వచ్చి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. మండలంలోని వడపర్తి రెవెన్యూ పరిధిలో 14.20 ఎకరాల భూమిలో డీవీఆర్ రియల్ ఎస్టేట్ కంపెనీ యజమాని గత 10నెలల క్రితం ప్లాట్లు ఏర్పాటు చేయగా, ఇటీవల బొమ్మలరామారం మండలం మర్యాలకు చెందిన ఈదుల కంటి దయాకర్‌రెడ్డి, అక్రమంగా పట్టా చేసుకుని, నయీం పేరుతో తమను బెదిరించి ప్లాట్లను లాక్కొన్నాడని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూక్య సంతోష్‌నాయక్, నాయకులు సందార్‌నాయక్, ప్లాట్ యజమానులు ఉన్నారు.